క్లుప్తంగా

చికిత్స పొందుతూ మృతి


రమేష్ మృతదేహం

శాయంపేట : మద్యం మత్తులో తాపీ మేస్త్రీపై లేబర్ దాడి చేయగా చికిత్స పొందుతూ మేస్త్రీ మృతి చెందాడు. ఈ సంఘటన మంగళవారం నేరేడుపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్సై దేవేందర్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని నేరేడుపల్లి గ్రామానికి చెందిన గద్దల రమేష్ (50) తాపీమేస్త్రీ పని చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఈ నెల 16వ తేదీన ప్రగతిసింగారంలో గోరి కట్టేందుకు మేస్త్రీ రమేష్ మరో ఇద్దరు లేబర్లు వడ్డెపల్లి రాజేందర్, మణికొండ శంకర్‌తో పనికి వెళ్లాడు. గోరి కట్టె పని కొంత మాత్రమే ఉండడంతో వడ్డెపల్లి రాజేందర్ మద్యం సేవించి పనిచేయలేదు. అయినప్పటికీ అదే రోజు సాయంత్రం ఇద్దరు కూలీలకు చెరో రూ. 500 చొప్పున మేస్త్రీ చెల్లించారు. దీంతో ఆగ్రహించిన రాజేందర్ మేస్త్రీ రమేష్‌పై దాడికి దిగాడు. కడుపులో తన్ని, పురుషాంగంపై బలంగా కాలితో తన్నడంతో మేస్త్రీకి తీవ్ర గాయాలు అయ్యాయి. గమనించిన స్థానికులు అతని కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వగా కుటుంబ సభ్యులు అతన్ని ఇంటికి తీసుకెళ్లి మరుసటి రోజు చికిత్స నిమిత్తం ములుగు ఆసుపత్రికి తీసుకెళ్లారు. అనంతరం వరంగల్ ఎంజీఎంకు తరలించగా చికిత్సపొందుతూ మేస్త్రీ రమేష్ మంగళవారం మృతి చెందాడు. మృతుడి కుమారుడు ప్రవీణ్ ఫిర్యాదు మేరకు వడ్డెపల్లి రాజేందర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్‌లు వెల్లడించారు.

దరఖాస్తుల స్వీకరణ

శాయంపేట : మండల కేంద్రంలోని సాంఘీక సంక్షేమ బాలికల గురుకుల కళాశాలలో 2023–24 విద్యా సంవత్సరంలో ఖాళీగా ఉన్న ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఎంపీసీ, బైపీసీ కోర్సుల్లో మిగిలిన సీట్లను భర్తీ చేసేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సుభాషిణిదేవి మంగళవారం ప్రకటనలో పేర్కొన్నారు. అర్హత కలిగిన విద్యార్థులు తమ విద్యార్హత ధ్రువపత్రాలతో ఈనెల 31వ తేదీలోగా కళాశాలలో అందించాలన్నారు.

గొర్రెల పంపిణీ..



దామెర: మండలంలోని దమ్మన్నపేట్‌కు చెందిన గొర్లకాపర్లకు ప్రభుత్వం అందిస్తున్న 12 గొర్రెల యూనిట్లను మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు, ఎంపీటీసీ గండు రాము మాట్లాడారు. రాష్ట్రంలోని అన్ని కుల వృత్తులకు బీఆర్ఎస్ ప్రభుత్వం న్యాయం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి డాక్టర్ దీపిక, గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ పుల్యాల రఘుపతిరెడ్డి, పాండవుల భిక్షపతి, గొర్ల కాపరులు తదితరులు పాల్గొన్నారు.

చెక్కు అందజేత



శాయంపేట : మండల కేంద్రానికి చెందిన మహ్మద్ హైమత్‌కు లక్ష రూపాయల మైనారిటీ బంధు చెక్కును భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతిలు మంగళవారం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రానున్న రోజుల్లో మైనారిటీలకు 100 శాతం సబ్సీడీతో రూ.1లక్ష మైనార్టీబంధు రానున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మెతుకు తిరుపతి రెడ్డి, ఎంపీటీసీ బాసాని చంద్రప్రకాష్, ఉపసర్పంచ్ దైనంపల్లి సుమన్ తదితరులు పాల్గొన్నారు.

చిరంజీవి జన్మదినం



కమలాపూర్: ప్రముఖ సినీ నటుడు, పద్మభూషణ్ మెగాస్టార్ చిరంజీవి 68వ జన్మదిన వేడుకలను అంజనీపుత్ర ఫ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఎస్సీ కాలనీ ప్రాథమిక పాఠశాలలో వంద మంది విద్యార్థులకు మిఠాయిలతో పాటు నోట్ బుక్కులు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ అసోసియేషన్ మండల అధ్యక్షుడు గట్టు నారాయణగౌడ్, నాయకులు వెనిశెట్టి శివకుమార్, కాటం తిరుపతి, నాగరాజు, ప్రవీణ్, ఉపాధ్యాయులు పుష్పనీల, సువర్ణ, ప్రభావతి, అంజనీదేవి, స్వప్న, సిబ్బంది రాజేశ్వరి, సుజాత, చిరంజీవి అభిమానులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నేడు వైద్యశిబిరం

చెన్నారావుపేట : కార్మిక శాఖ, సీఎస్‌సీ హెల్త్ కేర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాన్ని ప్రజలు వినియోగించుకోవాలని సర్పంచ్ కుండె మల్లయ్య కోరారు. స్థానిక గ్రామ పంచాయతీ ఆవరణలో నేడు (బుధవారం)ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు.

క్రీడలతో మానసికోల్లాసం


ఎల్కతుర్తి జెడ్పీహెచ్ఎస్‌లో కబడ్డీ ఆడుతున్న బాలికలు

ఎల్కతుర్తి: క్రీడలతో మానసికోల్లాసం లభిస్తుందని ఎంపీపీ జక్కుల అనిత అన్నారు. భీమదేవరపల్లి మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో రెండు రోజుల పాటు నిర్వహించే మండల స్థాయి క్రీడా పోటీలను మంగళవారం ఆమె ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకుని మాట్లాడారు. క్రీడలతో మానసికోల్లాసంతో పాటు ప్రశాంతత లభిస్తుందన్నారు. క్రీడలతో శారీరక దృఢత్వం, స్నేహబంధం పెంపొందుతుందన్నారు. యువతి, యువకులు, విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని కోరారు. అండర్ 14 నుంచి 17లోపు బాలికలకు కబడ్డీ నిర్వహించినట్లు తెలిపారు. బుధవారం ఖోఖో, వాలీబాల్ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై సాయిబాబు, కన్వీనర్ ప్రభాకర్, సెక్రటరీ రాజేశ్వరి, క్రీడాకారులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

దామెర: క్రీడలతో మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎంఈఓ సంపతి రమాదేవి అన్నారు. మండలంలోని ఒగ్లాపూర్ సమీపంలోని డిస్నీల్యాండ్ ఈ–టెక్నో పాఠశాలలో మండల స్థాయి కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ క్రీడలను మంగళవారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. గెలుపు ఓటములను సమానంగా స్వీకరించాలని క్రీడాకారులకు సూచించారు. క్రీడలతో మానసికోల్లాసంతో పాటు స్నేహబంధం పెంపొందుతుందని అన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని సూచించారు. క్రీడల్లో మాత్రమే పోటీ తత్వం ప్రదర్శించాలని, క్రీడల అనంతరం స్నేహంతో ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ శోభారాణి, ఒగ్లాపూర్ గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ కేతిపల్లి శ్రీధర్‌రెడ్డి, డైరెక్టర్లు దినేష్‌చందర్, రాకేష్‌భాను, ఉపాధ్యాయులు గుండు కనకరాజు, మండల క్రీడా కార్యదర్శి కమలాకర్, రజిత, రాజ్‌కుమార్, తిరుపతిరెడ్డి, మల్లేష్ పాల్గొన్నారు.


దామెరలో క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎంఈఓ

వాటర్‌క్యాన్లు మోసిన విద్యార్థులు


వాటర్ క్యాన్లు మోస్తున్న విద్యార్థులు

శాయంపేట : పెన్నులు పట్టి రాయాల్సిన చేతుల్లోకి వాటర్ క్యాన్లు చేరాయి. ప్రజాప్రతినిధులు హాజరు అవుతున్నారనే కారణంతో సదరు ఉపాధ్యాయులు విద్యార్థులతో క్యాన్లు మోయించారు. మండలంలోని పత్తిపాక ప్రభుత్వ పాఠశాలలో మన ఊరు మనబడి కార్యక్రమంలో భాగంగా అదనపు తరగతి గదులు, భోజనశాల, మరుగుదొడ్ల నిర్మాణం, పాఠశాల సుందరీకరణ పనులను ప్రారంభించేందుకు ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, వరంగల్ జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి మంగళవారం హాజరు కానున్న నేపథ్యంలో తాగునీరు సదుపాయం కోసం వాటర్ క్యాన్‌లు తెప్పించారు. అయితే వాటర్ క్యాన్లు అదించేవారు లేకపోవడంతో అక్కడున్న విద్యార్థులతో క్యాన్లు మోయించారు. దీంతో అక్కడికి వచ్చిన విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహించారు. పిల్లలతో పనులు చేయించడం ఏంటని ప్రశ్నించారు. అటెండర్‌ను నియమించి పనులు చేయించాలని అన్నారు. కాగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవీందర్‌ను ఫోన్ ద్వారా వివరణ కోరగా తాను అందుబాటులో లేనని ట్రేనింగ్‌కు వెళ్లానని తెలిపారు. విద్యార్థులు పాఠశాల ఆరవణంలో క్యాన్లు మోశారని, బయటి నుంచి కాదంటూ సమర్థించుకునే ప్రయత్నం చేశారు.

ఆర్థిక సాయం అందజేత



కమలాపూర్: మండలంలోని ఉప్పల్‌లో వివిధ కారణాలతో ఇటీవల మృతి చెందిన ఎలిగేటి నాగలక్ష్మి, పోతిరెడ్డి సారయ్య కుటుంబాలకు బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు నాయినేని తిరుపతిరావు రూ.5 వేల చొప్పున ఆర్థిక సాయం చేశారు. తిరుపతిరావు పంపిన ఆర్థిక సాయం నగదును మంగళవారం స్థానిక సర్పంచ్ ఎర్రబెల్లి దేవేందర్‌రావు బాధిత కుటుంబ సభ్యులకు అందించారు. అలాగే మండల కేంద్రానికి చెందిన ఏకు రాజు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా అభ్యుదయ గురుకుల విద్యాలయంలో పదో తరగతి చదువుకున్న 2000–01 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు రాజు భార్య సుజాతకు రూ.16,500 ఆర్థిక సాయంగా అందించారు. బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు జక్కుల రాజు, వార్డు సభ్యులు ఎర్రబెల్లి శ్రీధర్‌రావు, పిప్పాల పద్మసంపత్, మాజీ సర్పంచ్, ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు పోతిరెడ్డి రఘు, నాయకులు దండబోయిన నరేష్, మయాజ్‌అలీ, సంజీవరావు, రవీందర్‌రావు, ఎలిగేటి రాజమౌళి, రమేష్, సతీష్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో స్వాతినక్షత్ర కల్యాణం


కల్యాణం నిర్వహించిన అర్చకులు


ప్రత్యేక అలంకరణలో లక్ష్మీనృసింహస్వామి


గర్భాలయంలో లక్ష్మీ నృసింహస్వామి

ఐనవోలు: మండలంలోని కక్కిరాలపల్లి శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయంలో శ్రావణమాసం స్వాతినక్షత్ర పూజలు మంగళవారం ఘనంగా జరిగాయి. అందులో భాగంగా శ్రీలక్ష్మీనరసింహ స్వామి మూలమూర్తికి, గర్భాలయంలో ప్రతిష్ఠించిన లక్ష్మీనృసింహ స్వామి ధ్రువ మూర్తులకు, ఉత్సవ మూర్తులకు పంచామృతాలతో అర్చకులు అభిషేకం జరిపించారు. అనంతరం లక్ష్మీ–నరసింహ స్వామి, శ్రీదేవి, భూదేవి- వెంకటేశ్వర స్వామిల ఉత్సవ మూర్తులకు ఒకే వేదికపై కల్యాణం జరిపించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ పబ్బతి సత్యనారాయణ, మార్నేని వెంకటేశ్వర్‌రావు–శారద దంపతులు, అలువాల సాయి ప్రసాద్, కోదాటి మాదవరావు, జంపాల సుధాకర్–నిర్మల తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత శుభ్రతపై దృష్టి సారించాలి



నెక్కొండ : దోమకాటు వల్ల సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ఉండాలంటే పరిసరాల శుభ్రతతో పాటు వ్యక్తిగత శుభ్రతపై దృష్టి సారించాలని వైద్యాధికారి ఎం.అరుణ్‌కుమార్ అన్నారు. మండలంలోని అలంకానిపేట పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మంగళవారం నాగారం సబ్ సెంటర్ పరిధిలోని ఎస్సీ కాలనీలో దోమల మందు పిచికారీని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో ఒకరికి డెంగీ నిర్ధారణ కావడంతో జిల్లా వైద్యాధికారి ఆదేశాల మేరకు వైద్యశిబిరం ఏర్పాటు చేశామన్నారు. ప్రతిఒక్కరూ తమ ఇంటి చుట్టు పక్కల చెత్తా, చెదారాన్ని ఎప్పటికప్పుడు తొలంచాలని ఆయన సూచించారు. దోమల నివారణకు మురుగు కాల్వలు, నిల్వ ఉన్న నీటిలో కిరోసిస్ ఉండలు (బాల్స్)ను వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నర్సంపేట సబ్ యూనిట్ మలేరియా వైద్యాధికారి నంద, సూపర్‌వైజర్ రాజు, సిబ్బంది వినోద, ఆశ కార్యకర్తలు అరుణ, కళ్యాణి, తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు అన్యాయం చేస్తున్న బీఆర్ఎస్, కాంగ్రెస్

రాయపర్తి : పాలకుర్తి అసెంబ్లీ ఎన్నికల అభ్యర్థుల ప్రకటనలో అత్యధికంగా ఉన్న బీసీ జనాభాకు బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు మొండి చెయ్యి చూపెట్టాయని బీఎస్పీ పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ సోమారపు ఉపేందర్ అన్నారు. మంగళవారం మండలంలోని కేశవాపురం గ్రామంలో నియోజకవర్గ కోశాధికారి చిలుముల కృష్ణ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పాలకుర్తి నియోజకవర్గంలో అత్యధికంగా బీసీ సామాజిక వర్గాల ప్రజలు ఉన్నప్పటికి అత్యల్పంగా ఉన్న రెడ్డి, రావులకే బీఆర్ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులుగా ప్రకటించడం పట్ల బీసీ సమాజం నిరాశలో ఉన్నారని తెలిపారు. పాలకుర్తి గడ్డపై గడిచిన 50 ఏళ్లుగా వెలమలు మాత్రమే ప్రాతినిథ్యం వహిస్తూ బీసీలను రాజకీయంగా ఎదగకుండా అణగదొక్కుతున్నారన్నారు. తెలంగాణలో బీసీలకు 70 స్థానాలు ఇస్తామంటున్న ఏకైక పార్టీ బహుజన సమాజ్‌వాది పార్టీయేనని పాలకుర్తి నియోజకవర్గంలోసైతం బీసీ బిడ్డనే అభ్యర్థిగా ప్రకటించే అవకాశం ఉందన్నారు. బీసీలు ఇప్పటికైనా మేల్కొని సొంత ఇంటిలాంటి బీఎస్పీలోకి రావాలని పిలుపునిచ్చారు. సీఎం కేసీఆర్ ఎన్నికల ముందు అనేక హామీలు ఇస్తున్నారని, కానీ అందులో ఏ ఒక్క హామీ నెరవేర్చని అన్నారు. కేవలం ఎన్నికల్లో గెలిచేందుకు మాత్రమే పథకాలను ముందుకు తెస్తున్నారని అన్నారు. బీసీలకు అన్యాయం చేస్తున్నా బీఆర్ఎస్ పార్టీలో ఉన్న బీసీలు నోరు మెదపడం లేదని ఆరోపించారు. బానిసత్వానికి చరమగీతం పాడాల్సిన సమయం వచ్చిందన్నారు. ఇప్పటికైనా బీసీలందరూ ఏకం కావాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు ప్రేమ్‌సింగ్ నాయక్, రాపాక శ్రీశైలం, పడమటింటి భాస్కర్, ఈదునూరి ప్రసాద్, రంజిత్‌కుమార్, చింత గణేష్, ప్రశాంత్, ఫజల్ పాల్గొన్నారు.

ఎల్‌ఓసీ అందజేత

సంగెం : మండలంలోని వీఆర్ఎన్ తండాకు చెందిన గుగులోత్ వీరేందర్‌కు ఓయూ రాష్ట్ర గిరిజన నాయకుడు డాక్టర్ బి.సంజీవ్ నాయక్ ఎల్‌ఓసీ అందజేశారు. ఇటీవల వీరేందర్ అనారోగ్యంతో ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందారు. నిరుపేద కుటుంబానికి చెందిన ఆయన ఆర్థికంగా ఆదుకోవాలని వేడుకున్నారు. స్పందించిన ఓయూ రాష్ట్ర గిరిజన నాయకుడు సంజీవ్ ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.30 వేల ఎల్‌ఓసీ మంజూరు చేయించారు. మంగళవారం బాధితుడు వీరేందర్‌కు చెక్కును అందజేసి పరామర్శించారు.

రెగ్యులరైజ్ చేసేవరకూ సమ్మె కొనసాగిస్తాం


వినతిపత్రం అందజేస్తున్న సెకండ్ ఏఎన్ఎంలు

చెన్నారావుపేట : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ 16 రోజులుగా సెకండ్ ఏఎన్ఎంలు చేస్తున్న సమ్మెకు మద్దతుగా ఆరోగ్య ఉప కేంద్రాలలోని ఇతర సిబ్బందితో పని చేయించకుండా సహకరించాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ ప్రకాశ్, డాక్టర్ సరోజలకు మంగళవారం రెండో ఏఎన్ఎంలు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా సెకండ్ ఏఎన్ఎంలు రాజకుమారి, మంజుల మాట్లాడుతూ.. చాలాకాలంగా వైద్యసేవలు అందిస్తున్న తమకు ప్రభుత్వం గుర్తించి రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. కరోనా సమయంలో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా, కుటుంబాలను వదిలేసి విధులు నిర్వహించామన్నారు. తమ సమస్యలు అర్థం చేసుకుని వైద్యారోగ్య శాఖలో పని చేస్తున్న తోటి సిబ్బంది మద్దతుగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో శ్వేత, రమ, పుష్ప, కవిత, పుష్పలీల, సుధ, లలిత, కాంతి తదితరులు ఉన్నారు.

అక్రమ అరెస్టులకు ఎస్ఎఫ్ఐ భయపడదు..

నర్సంపేట : రాష్ట్ర వ్యాప్తంగా విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్ కార్యాలయాల ముట్టడి చేస్తున్న విద్యార్థి నాయకులపై పోలీసులు లాఠీచార్జ్ చేసి అక్రమంగా అరెస్టు చేయడాన్ని ఖండిస్తున్నామని ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి పైసా గణేష్ అన్నారు. ఈ మేరకు పట్టణంలోని అమరవీరుల స్తూపం వద్ద మంగళవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ ఎన్ని నిర్బంధాలు చేసిన విద్యారంగ సమస్యలను పరిష్కరించేంత వరకు పోరాడుతామన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి పది సంవత్సరాలైనా ఇప్పటి వరకు సమస్యలను పరిష్కరించకపోగా ప్రశ్నించిన వారిపై జులూం చేస్తున్నారని ఆయన ఆరోపించారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి


మందులు అందజేస్తున్న సర్పంచ్

రాయపర్తి : సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని సర్పంచ్ చిన్నాల తార శ్రీరాజబాబు కోరారు. మంగళవారం మండలంలోని పెర్కవేడు గ్రామంలో ప్రభుత్వ ఆస్పత్రి ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ వర్షాకాలంలో వచ్చే వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. పరిసరాల శుభ్రతను పాటించాలన్నారు. పంచాయతీ కార్యదర్శి వెంకటేష్ నాయక్, హెల్త్ సూపర్ వైజర్ భీమా నాయక్, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

వేతన సవరణ కమిషన్‌ను నియమించాలి


సమావేశంలో మాట్లాడుతున్న తిరుపతి

శాయంపేట : రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయుల వేతన సవరణ కమిషన్‌ను వెంటనే నియమించాలని టీపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నన్నెబోయిన తిరుపతి డిమాండ్ చేశారు. మండలంలోని గట్లకానిపర్తి, పెద్దకోడెపాక, మైలారం, శాయంపేట, తహరాపూర్ గ్రామాల్లోని ప్రభుత్వ ఉన్నత, ప్రాథమిక పాఠశాలలోని తెలంగాణ ప్రొగ్రెసివ్ టీచర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులతో మంగళవారం సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. పీఆర్సీ జూన్ 31 వ తేదీన ముగిసినందున ప్రభుత్వం వెంటనే నూతన వేతన సవరణ స్కేల్ కోసం పీఆర్సీ కమిషన్‌ను నియమించాలన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు మధ్యంతర భృతిని వెంటనే విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రావుల రమేష్, నాయకులు బిల్లా సుబ్బారావు, చంద్రగిరి లక్ష్మయ్య, కుమారస్వామి, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

జిమ్మిక్కు రాజకీయాలు మానుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న బుచ్చిరెడ్డి

శాయంపేట : పల్లె నిద్ర పేరుతో జిమ్మిక్కులు చేస్తున్న భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డికి ప్రజల చేతిలో ఓటమి తప్పదని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి విమర్శించారు. మండల కేంద్రంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. గత నెలలో కురిసిన భారీ వర్షాలకు రైతులు సాగు చేసుకున్న పంటలు వరదలో కొట్టుకుపోయి తీవ్రంగా నష్టపోయారని గుర్తు చేశారు. లోతట్టు ప్రాంతాల్లో పేద ప్రజల ఇళ్లు, సరుకులు నీటమునిగి రోడ్డున పడినా ఎమ్మెల్యే ఎందుకు పట్టించుకోలేదో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ తొలిజాబితాలో పేరు ప్రకటించిన గంట వ్యవధిలోనే ప్రజలు గుర్తుకొచ్చారా అని ప్రశ్నించారు. ఎన్ని కుట్రలు పన్నినా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి భారీ మెజారిటీతో గెలుపొందడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పార్టీ నేతలు ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకోవాలని అన్నారు. నాయకులు చిందం రవి, నిమ్మల రమేష్, వలిహైదర్, రఫీ, నరేష్‌రెడ్డి, జగన్, విష్ణు, సంపత్, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎల్లమ్మతల్లి వనభోజనాలు


ఎల్లమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే

ఐనవోలు: మండలంలోని కక్కిరాలపల్లిలో మంగళవారం ఎల్లమ్మతల్లి వనభోజనాలు ఘనంగా జరిగాయి. బీఆర్ఎస్ పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు, వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్, కాంగ్రెస్ పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ వేర్వేరుగా హాజరై ప్రత్యేక పూజలు చేశారు. గ్రామ ప్రజలు సుఖశాంతులు, సంతోషంతో ఉండేలా దీవించాలని అమ్మవారిని ప్రార్థించారు. బీఆర్ఎస్ పార్టీ నుంచి మూడోసారి ఎమ్మెల్యే అభ్యర్థిగా అరూరి రమేష్‌ను ప్రకటించడంతో ఆ పార్టీ నాయకులు ఆయనకు శాలువాతో సన్మానించారు. మళ్లీ విజయం సాధించడం ఖాయమన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు గ్రామంలోని శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఎర్రబెల్లి వరదరాజేశ్వర్‌రావు, వర్ధన్నపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ నమిండ్ల శ్రీనివాస్, సొసైటీ వైస్ చైర్మన్ చందర్‌రావు, సర్పంచ్ కంజర్ల రమేష్, ఎంపీటీసీ తాటికాయల రమేష్, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

జీవఎరువులతో తెగుళ్ల నివారణ


జీవ ఎరువులను పరిశీలిస్తున్న గౌస్

శాయంపేట : జీవ ఎరువుల వాడకంతో తెగుళ్లను నివారించవచ్చని ప్రజ్వల్ ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ ప్రతినిధి షేక్ గౌస్ అన్నారు. మండలంలోని ప్రగతిసింగారం గ్రామంలో మంగళవారం నేలపునరుత్పాదక వ్యవసాయంలో భాగంగా రైతుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ట్రైకొడర్మ వంటి జీవన సంబంధ ఎరువులతో అగ్గి తెగుళ్లు, వేరుకుళ్లు, ఎండుతెగుళ్లు నుంచి పంటను కాపాడుకోవచ్చని అన్నారు. అనేక రకాల రసాయన ఎరువులు, పురుగు మందుల వినియోగం వలన నేలలోని సేంద్రీయ కర్బనం తగ్గిపోయి తెగుళ్ల వ్యాప్తి చెందే అవకాశం ఉందన్నారు. జీవన ఎరువుల వాడకంతో తెగుళ్లు పూర్తిగా నశిస్తాయని అన్నారు. మాజీ సర్పంచ్ పిట్టల సంజీవయ్య, రైతులు పిట్టల రాజయ్య, చిలుకల సుధాకర్, పెద్దిరెడ్డి తిరుపతిరెడ్డి, వంశీ, రాజిరెడ్డి, ప్రజ్వల్ సిబ్బంది పాల్గొన్నారు.

నిరుద్యోగభృతిని మరిచిన కేసీఆర్


మాట్లాడుతున్న సదానందం

ఆత్మకూరు: రాష్ట్రంలోని నిరుద్యోగులకు ఇస్తానన్న నిరుద్యోగభృతిని సీఎం కేసీఆర్ మరిచిపోయారని బీజేపీ మండల అధ్యక్షుడు సదానందం విమర్శించారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి యువత తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కేసీఆర్ మాయ మాటలు చెబుతూ ప్రజలను మోసం చేస్తున్నారని ఆరోపించారు. గత ఎన్నికల సమయంలో జర్నలిస్టులకు ఇళ్లు, ఇళ్ల స్థలాలు, నిరుద్యోగులకు భృతి, నిరుపేదలకు డబుల్‌బెడ్రూం ఇళ్లు, దళితులకు మూడేకరాల భూమితో పాటు వివిధ హామీలు ఇచ్చి ఏ ఒక్కటి నెరవేర్చకుండానే మళ్లీ ఎన్నికలకు వస్తున్నారని అన్నారు. ప్రజలు, మేధావులు, యువకులు సీఎం కేసీఆర్, బీఆర్ఎస్ పార్టీకి గుణపాఠం చెప్పాలని కోరారు. ఓటు వేసే బీఆర్ఎస్ చేసిన మోసాలను గుర్తుతెచ్చుకోవాలని ఆయన ప్రజలను కోరారు. మండల ప్రధానకార్యదర్శి ఉప్పుగల్ల శ్రీకాంత్‌రెడ్డి, కిసాన్‌మోర్చా కన్వీనర్ వంగాల బుచ్చిరెడ్డి, మండల కార్యదర్శి బయ్య పైడి, ఓబీసీ మండల అధ్యక్షుడు వెల్దె సదానందం, ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

‘మైనంపల్లి’ దిష్టిబొమ్మ దహనం


మైనంపల్లి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కమలాపూర్: రాష్ట్ర ఆర్థిక, వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావుపై మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసిస్తూ మంగళవారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు మైనంపల్లి హన్మంతరావు దిష్టిబొమ్మను దహనం చేశారు. మంత్రి హరీష్‌రావుపై చేసిన వ్యాఖ్యలు వెంటనే వెనక్కి తీసుకుని క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. పార్టీ అధిష్టానం స్పందించి మైనంపల్లి హన్మంతరావును వెంటనే పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని కోరారు. సర్పంచ్ మాట్ల రవీందర్, కేడీసీసీబీ జిల్లా డైరెక్టర్ పొరండ్ల కృష్ణప్రసాద్, లాండిగె లక్ష్మణ్‌రావు, నవీన్‌కుమార్, శ్రీకాంత్, శ్రీనివాస్, కుమారస్వామి, వినోద్‌కుమార్, నాగేందర్ పాల్గొన్నారు.